నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 19 ఆగస్టు 2024 | KARIMNAGAR

## రైతులను నిండా ముంచారు

రేవంత్‌పై మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ధ్వజం

కరీంనగర్ కార్పొరేషన్, ఆగస్టు 18: అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్ 9నే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి, రైతులను నిండా ముంచారని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం మొదట రూ.41వేల కోట్లు రుణమాఫీకి అవసరమని చెప్పి, కేబినెట్ భేటీలో రూ.31 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొని, ఇప్పుడు కేవలం రూ.17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎత్తిపోయకపోవడంతో ఇప్పుడు ఉత్తర తెలంగాణ ఎడారిగా మారే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో ఈ వానకాలం సీజన్‌లో పంటల సాగు తగ్గిందని, వచ్చే యాసంగి సీజన్‌లో కనీసం 20 నుంచి 30 శాతం కూడా పంటల సాగు అయ్యే అవకాశం లేదన్నారు. పదేళ్లు తెలంగాణ ఉద్యమ నేత కేసీఆర్ ఉన్నన్ని రోజులు ఎర్రని ఎండల్లోనూ చెరువులు మత్తళ్లు దుంకాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎనిమిది నెలల పాలనలో వర్షాకాలంలో కూడా చుక్క నీళ్లు లేకుండా పోయాయని పేర్కొన్నారు.

సిరిసిల్ల బైపాస్‌రోడ్డులో సర్దార్‌సర్వాయి పాపన్న విగ్రహం ఎదుట నినదిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

## 'పాపన్న' ఆశయ సాధనకు కృషిచేశాం

### మా ప్రభుత్వంలో గొడన్నలకు అండగా నిలిచాం

- తాటి, ఈత చెట్ల పన్నులను మాఫీ చేశాం
- పట్టణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని చండీయాగం చేయడం అభినందనీయం
- వస్త్ర పరిశ్రమలో సంక్షోభం తొలగి, సంక్షేమం వైపు పయనించాలన్నదే నా ఆకాంక్ష
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): 'బహుజన రాజ్యం కోసం, తెలంగాణపై నిరంకుశ శక్తులకు వ్యతిరేకంగా పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషిచేశాం. కేసీఆర్ ప్రభుత్వంలో గొడన్నలకు అండగా నిలిచాం. గ్రామీణ ప్రాంతాల్లోని గొడన్నలకు తాటి, ఈత చెట్ల పన్నులతోపాటు గతంలో ఉన్న బకాయిలన్నింటినీ పూర్తిస్థాయిలో మాఫీ చేశామని' బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలో పర్యటించారు. సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకుని మొదటి బైపాస్‌రోడ్డులోని నర్సింగ్ కళాశాల చౌరస్తాలో ఏర్పాటు చేసిన పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కులవృత్తిపైనే ఆధారపడిన గొడన్నల ఉపాధి కోసం మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించామని, నీరా పాలసీ తెచ్చి ట్యాంక్ బండ్ నెక్లెస్ రోడ్డులో నీరా కేఫ్ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ప్రాచుర్యం కల్పించినట్లు చెప్పారు. నీరా వల్ల ఆరోగ్య పరమైన లాభాలుంటాయని ప్రజలకు వివరించి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. పిల్లలు చదువుకోవడానికి వందలాది ఎస్సీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి లక్షల మందికి విద్యావకాశాలు కల్పించింది గత కేసీఆర్ ప్రభుత్వమన్నారు. సర్వాయి పాపన్న పోరాట యోధుడని, ఆ మహనీయుడి పేరును జనగామ లేదా రాష్ట్రంలోని మరేదైనా జిల్లాకు నామకరణం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పైన ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కాగా, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభం తొలగి పోవాలని పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ ఆలయంలో నిర్వహిస్తున్న చండీయాగానికి హాజరైన కేటీఆర్‌కు పద్మశాలీ సంఘ ప్రతినిధులు, పురోహితులు ఘనస్వాగతం పలికారు. చండీయాగంలో ప్రత్యేక పూజలు చేసిన ఆయనను పద్మ పురోహితులు సన్మానించి, ఆశీర్వదించారు. అనంతరం పలు వివాహ కార్యక్రమాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రజలు సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో చండీయాగం నిర్వహించడం పట్ల పద్మశాలీ సంఘ సభ్యులను అభినందించారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభం తొందరగా తొలగి పోయి నేతన్నలు సంక్షేమం వైపు పయనించాలని ఆకాంక్షించారు. శ్రీమార్కండేయ స్వామి ఆలయ నిర్మాణానికి శాసన సభ్యుడిగా తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గత కేసీఆర్ ప్రభుత్వం పద్మశాలీ సంఘ భవనానికి స్థలం ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో తెలంగాణ సుభిక్షంగా ఉండేలా శ్రీ మార్కండేయుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, పార్టీ నాయకులు బొల్లి రాంమోహన్, గూడూరి ప్రవీణ్, బుర్ర నారాయణగౌడ్, అందె సుభాష్, పద్మశాలీ సంఘం నాయకులు గోలి వెంకటరమణ, మోర రవి, డాక్టర్ గాజుల బాలయ్య పాల్గొన్నారు.

కన్నాపూర్ గ్రామ చావడి వద్ద ధర్నా చేస్తున్న రుణమాఫీ కాని రైతులు

## మేం అర్హులం కాదా?

- మాకెందుకు రుణ మాఫీ చేయరు?
- రూ.2 లక్షలకుపైన ఉన్న అప్పు చెల్లిస్తేనే చేస్తారా
- జాబితాలో మా పేర్లు ఏవి?
- మంత్రి 'తుమ్మల' సోయితోనే మాట్లాడుతున్నారా?
- శంకరపట్నం మండలం కన్నాపూర్ రైతుల సూటి ప్రశ్నలు
- గ్రామ సభ నిర్వహించి అర్హులెవరో తేల్చాలని డిమాండ్
- మాఫీ జరిగినా వడ్డీ చెల్లించనిదే రెన్యువల్ లేదంటున్నరు
- బ్యాంకులు తప్పు చేస్తున్నాయా.. ప్రభుత్వమా..!
- మధ్యలో మమ్మల్ని ఎందుకు బలి పెడుతున్నారని నిలదీత

### కన్నాపూర్ రైతుల డిమాండ్లు

తమ గ్రామంలో రైతు గ్రామ సభలు నిర్వహించాలని, అర్హత ఉండి రుణమాఫీకి నోచుకోని వారిని గుర్తించాలని, గ్రామ సభ ద్వారానే ఇది సాధ్యమవుతుందని కన్నాపూర్ రైతులు స్పష్టం చేశారు. గ్రామ సభకు వ్యవసాయ అధికారులతోపాటు బ్యాంక్ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వచ్చి తమ బాధలు వినాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రుణమాఫీ చేసే పద్ధతి ఇదేనా? అని ప్రశ్నించారు. రూ.2 లక్షలకంటే రుణం ఎక్కువ ఉన్న రైతులు మిగతావి చెల్లించాలని, అప్పుడే రూ.2 లక్షలు వర్తిస్తాయని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమ పేర్లు మాఫీ జాబితాలోనే లేనప్పుడు ఎట్లా చెల్లిస్తామని నిలదీశారు. బ్యాంకుల వారీగా తమ గ్రామంలో కౌంటర్లు ఏర్పాటు చేస్తే నిమిషాల్లో మిగిలిన మొత్తం చెల్లిస్తామని స్పష్టం చేశారు. తాము ఎంత బాకీ ఉన్నా రూ.2 లక్షలు మాఫీ చేస్తే సరిపోతుంది కదా?, మాఫీ చేయడం చేతకాక ఇవ్వన్ని సాకులు ఎందుకు చెబుతున్నారని మంత్రిని ప్రశ్నించారు.

**శంకరపట్నం మండలం కన్నాపూర్‌లో ఒక్కో రైతుది ఒక్కో గాథ. ఎవరిని కదిలించినా రుణమాఫీ వెతలే వెలికి వస్తున్నాయి. ఈ ఊళ్లో ఒక్కరికి కాదు.. ఇద్దరికి కాదు.. 400 మందికి పైగా రైతులు రుణమాఫీకి నోచుకోలేదు. ప్రభుత్వం పెట్టిన మెలికలన్నింటికీ సరిపోతున్నా రుణమాఫీ ఎందుకు కాలేదో ఈ గ్రామ రైతులకు బోధపడడం లేదు. రూ.2 లక్షలకు పైన అప్పు తీసుకున్న రైతులు వాటిని చెల్లిస్తేనే మాఫీ చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పడాన్ని ఈ గ్రామ రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ముందు గ్రామ సభలు పెట్టి అర్హులెవరో, అనర్హులెవరో తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లిన 'నమస్తే తెలంగాణ' బృందం ముందు గ్రామ రైతులు ఒక్కొక్కరు తమ బాధలను ఏకరువు పెట్టారు. స్థానిక గ్రామ పంచాయతీ ఎదుట సుమారు 100 మంది రైతులు నిరసన తెలిపారు. రుణమాఫీ కోసం వారు పడుతున్న గోడును చెప్పుకొన్నారు.**

**- కరీంనగర్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ)/ శంకరపట్నం**

### నాకు రాలే.. మా బాపుది రాలే..

మొలంగూర్ ఇండియన్ బ్యాంకుల నా పేరు మీద రూ.1.60 లక్షలు, మా బాపు పోచమల్లు పేరు మీద రూ.32 వేలు అప్పున్నది. ఇద్దరిది కలిపితే రూ.2 లక్షలు సుతం అయిత లేదు. కాంగ్రెస్ సర్కార్ చెప్పినట్టు ఒక కుటుంబానికి రూ.2 లక్షలు మాఫీ అయినా మా ఇద్దరి అప్పు మాఫీ కావాలె. మొదటి విడుతల మా బాబు పేరు వస్తదని చూస్తే రాలే. కనీసం మూడో లిస్టులన్నా నా పేరు ఉంటదని చూస్తే లేదు. కుటుంబానికి రూ.2 లక్షలు మాఫీ చేస్తమన్నరు కదా.. మా ఇద్దరిట్ల ఎవల్దొక్కలదన్నా మాఫీ కావద్దా..? ఇదేం పద్ధతన్నట్టు. మేమేమన్నా రుణాలు ఎగవెట్టెటోళ్లమా. ఆరు నెల్లకోసారి వడ్డీతో సహా కట్టి రెన్యువన్ చేయించుకోనేవడ్తిమి. మాకెందుకు అప్పు మాఫీ కాదు?

**- అడితం శ్రీనివాస్, రైతు**

### కేసీఆర్ సర్కారప్పుడు మాఫీ అయినయ్..

కేసీఆర్ సర్కారున్నపుడు మాఫీ అయినయ్. మా ఊళ్లె చానా మంది లాభపడ్డరు. ఇప్పుడు నాతో సహా చానా మందికి మాఫీ కాలే. నేను తీసుకున్నది ఉత్త రూ.33 వేలే. మొదటి విడుతలనే మాఫీ కావాలె. మూడో విడుత అయిపోయింది. ఏ లిస్ట్‌ల నా పేరు లేదు. నా అసోంటి చిన్నది లెక్కకే రాలేదంటే రూ.2 లక్షలు మాఫీ చేస్తమంటే ఎట్ల నమ్ముడు. ఇదంతా బోగస్. మాతోని నాటుకాలు ఆడుతున్నరు. ఈ చిన్న మొత్తం మాఫీ కోసం బ్యాంకుకు పోతే మాకు తెల్వది. వ్యవసాయ అధికారులను అడుగుమంటున్నరు. వ్యవసాయ అధికారుల వద్దకు పోతే బ్యాంకు స్టేట్‌మెంట్ తెమ్మంటరు. అటు తిరిగి ఇటు తిరిగి పానం పోతుంది గానీ పైసలైతే మాఫీ కాలే. ఇప్పుడు ఎట్లయితే గట్లయితది. మళ్ల ఓట్లని అడిగెతానికి వచ్చినప్పుడు చెప్తం.

**- పిన్నింటి శ్రీనివాస్ రెడ్డి**

### చెప్పిందే చెప్పుడు తప్ప మాఫీ లేదు

మాకు ఉన్నదే ఎకురం. బ్యాంకుల రూ.43 వేలు అప్పున్నం.. మొలంగూర్ ఇండియన్ బ్యాంకుల తీసుకొని ఏడాది కూడా ఐతలేదు.. మొదటి విడుత అన్నరు.. రెండో విడుత అన్నరు.. లాస్ట్‌కు మూడో విడుతల కూడా మాకు మాఫీ కాలే.. మేం గదే తిరుగుడు.. వాళ్లేమో చెప్పిందే చెప్పు తాన్రు తప్ప మాఫీ మాత్రం అయిత లేదు.. గట్టిగ అడిగితే బ్యాంకోళ్లు స్టేట్‌మెంట్ ఇచ్చిండ్రు.. అందులో ఏం లేదు.. పై నుంచి మాఫీ కాకపోతే మేమేంజేత్తం అంటన్రు.. రెండో విడుత తర్వాత ఏఈఓ మేడం వద్దకు పోయి దరఖాస్తు ఇస్తే లాస్ట్ విడుత దాకా చూద్దాం.. ఇప్పుడు ఇయ్యకుండ్రి.. మీరు ఇచ్చినా మేం పక్కకు పెడుతం.. లాస్ట్ విడుత అయిపోయినంక పడకపోతె గప్పుడు రాండ్రి అన్నరు.. మాకు న్యాయం జరిగేదాకా రోడ్లెక్కుతం.

**- నూనె సదయ్య, రైతు**

### మాఫీ ఇంకెప్పుడు చేస్తరు



అంతా అయిపోయింది. మూడు విడుతలు వచ్చినయ్. దేంట్ల నా పేరు లేదు. నా భార్య కనకలక్ష్మి పేరు లేదు.. ఇంకెప్పుడు ఇస్తరు. మేం మెట్‌పల్లి సహకార బ్యాంకుల 2018 నుంచి అప్పు తెచ్చుకుంటున్నం. నా పేరు మీద రూ.80 వేలున్నయి. నా భార్య పేరు మీద రూ.లక్ష ఉన్నది. ఇద్దరియి కలిపినా రూ.2 లక్షలు కావాయె. మరి నా పేరు ఎందుకు రాకపాయె. నా భార్య పేరు ఎందుకు రాక పాయె. మేం అర్హులం కాదా.. మేం ఈ ఊళ్లె పుట్టలేదా..? మాఫీ అంటే అందరికీ కావాలె. కొందరికి ఇచ్చుడేంది. కొందరికి ఇయ్యకపోవుడేంది. ఓట్ల కోసం వచ్చినప్పుడు చెప్పినట్టు ఇప్పుడు రైతుల దగ్గరికి వచ్చి చెప్పస్త లేదా.. కాంగ్రెసోళ్లకు మొఖాలు లేవా..? మునుపు కేసీఆర్ ఉన్నపుడు గిట్టనే చేసిండా..? బక్క సక్కోళ్లనిడ్సిపెట్టి బలిసినోళ్లకే మాఫీ చేస్తున్నరు. మునుపు వచ్చినోళ్లకే మళ్లచ్చినయి. ఇప్పుడు రానోళ్లు చానా మంది ఉన్నరు.

**- మేడిదుల మల్లేశం**

- నేను రూ.38 వేలే అప్పు తీసుకున్న. మొదటి విడుతలనే మాఫీ చేస్తరని ఎదురు చూసిన. ఇప్పటి వరకు రాలే. రైతు రెడ్డి మల్లయ్య ఆవేదన..
- నేను రూ.1.50 లక్షలు తీసుకున్న రెండో విడుతల వస్తదని ఆశపడ్డ. కానీ ఇప్పటి వరకు ఆశ నెరవేరలే. ఇదీ కాటం రవీందర్‌రెడ్డి ఆక్రందన.
- నేను రూ.2 లక్షలు అప్పు తీసుకున్న మూడో విడుతలో వస్తదని చెప్పిండ్రు. ఎందుకు ఇవ్వ లేదు.. ఇదీ చింతిరెడ్డి రాజిరెడ్డి ఆక్రోశం.
- బ్యాంక్ స్టేట్‌మెంట్ చూస్తే నాకు రూ.2,10,700 అప్పు ఉంది. నాకు మాఫీ అవుతుందని నిన్నా మొన్నటి వరకు అటు అధికారులు, ఇటు బ్యాంకర్లు చెప్పిండ్రు. కానీ, నా పేరు జాబితాలో రాలే. మీది పైసలు ముందు కడితేనే రూ.2 లక్షలు మాఫీ చేస్తరట. ఇదెక్కడి విడ్డూరం. ఇదీ కాటం తిరుపతి రెడ్డి మనోవేదన..

### మేం రైతులం కామా.. ఎందుకు మాఫీ కాలే?

మేం పోయినసారి మొలంగూర్ బ్యాంకుల నా పేరున రూ.80 వేలు, మా ఆయన సమ్మయ్య పేరున రూ.లక్ష అప్పు తీసుకున్నం. ఇద్దరి అప్పు కలిసినా రెండు లక్షలు దాటుతలేదు కదా..! మరి మా అప్పు ఎందుకు మాఫీ కాలే.. ఇప్పటికి పది సార్ల మొలంగూర్ బ్యాంక్ చుట్టూ తిరిగినం.. పురుగులను చూసినట్లు చూస్తన్రు.. ఒక్కళ్లు సక్కగ సమాధానం చెప్పరు.. వీళ్లేమైనా వాళ్ల ఇంట్లకేంచి తెచ్చి మాకు పైసలు ఇత్తున్నరా.. మేం రైతులం కామా?.. మేం ఓట్లు వేయలేదా..? సర్కారు అధికారులు మనిషికోరకంగా ఎందుకు చేస్తుండ్రు.. అందరికీ ఒకేలాగ చేస్తేనే న్యాయం చేసినట్టు.. రైతుకోరకంగా చేస్తే ఎట్లా.. ఇప్పటికైనా మాకు న్యాయం జరుగాలె.

**- మర్రి రాధామణి, మహిళా రైతు**

### పైనోళ్లే చేస్తలేరని బ్యాంకోళ్లు అంటున్రు



మాకు ధర్మారం గ్రామ శివార్ల 103/బీ సర్వే నంబర్ల 20 గుంటల పొలం ఉంది. దాదాపు ఏడాది ఐతందనుకుంట.. పెట్టువడికి పైసలు లేకుండె.. మా ఊరోళ్లతో వెళ్లి నేను సుత మొలంగూర్ ఇండియన్ బ్యాంకుల రూ.25 వేల అప్పు తీసుకున్న.. మా ఊరోళ్లు ఎప్పుడు రమ్మంటె అప్పుడు పోతన్న.. బ్యాంకు సుట్టూ తిరుగుతన్నం.. నెల రోజులై తంది.. మాఫీ ఇగ జేత్తలేరు.. అగ జేత్తలేరు.. తిరిగీ తిరిగి కాళ్లు నొత్తన్నయ్ తప్పితే మాఫీ ఐతలేదు.. ఏమైందని బ్యాంకోళ్లను అడిగితే. మాదేం లేదు.. పైన పెద్దోళ్లే చేస్తలేరని చెప్పవట్టిరి.. సర్కారు గీ కొద్ది పైసలు కూడా మాఫీ చేయకుంటె ఎట్ల చెప్పుండ్రి.

**- పిన్‌రెడ్డి మల్లారెడ్డి, రైతు**

### రూ.లక్షా యాభై వేలు సుతం కాలే..



నా పేరు, మా భార్య సరమ్మ పేరు మీద మొలంగూర్ ఇండియన్ బ్యాంకుల క్రాఫ్‌లోన్ తీసుకున్నం. నా పేరు మీద 31 గుంటలు ఉంటే రూ.38 వేలు ఇచ్చిండ్రు. మా భార్య పేరు మీద 3 ఎకరాలు ఉంటే రూ.లక్ష ఇచ్చిండ్రు. 2018 నుంచి కడుతున్నం, తీసుకుంటున్నం. అప్పు మాఫీ అయితదంటే సంతోషపడ్డం. మా ఇద్దరిది కలిపి రూ.లక్షా యాభై వేలు సుతం లేకపాయె. రెండో విడుతల ఎందుకు ఇయ్యనట్టు. పోనీ వడ్డీ పెరిగి రూ.2 లక్షలు దాటిందా? అని అనుకుంటే మొన్ననే వడ్డీతో సహా కడ్తిమి. బ్యాంకుకు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరిగితే మూడో విడుతల వస్తదని చెప్పిండ్రు. ఈ విడతల సుత రాకపాయే. ఇగెప్పుడిస్తరు. చెర్ల నీళ్లుపోయి చెరువెన్కవడ్డంక ఇస్తరా..? ఇదంతా మంచిగ లేదు. ఇస్తరో ఇయ్యరో ఇప్పటికీ ఎవ్వలు చెప్తలేరు..

**- రెడ్డి మల్లయ్య**

### 600 రైతులకు.. 200 మందికే మాఫీ..

కేడీసీసీబీ మెట్‌పల్లి శాఖ, ఇండియన్ బ్యాంక్ మొలంగూర్ శాఖ, యూనియన్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు కేశవపట్నం శాఖల్లో తమ గ్రామ రైతులు సుమారు 600 మంది అప్పు తీసుకుంటే కేవలం 200 లోపే మందికి మాఫీ అయ్యిందని శంకరపట్నం మండలం కన్నాపూర్ రైతులు తెలిపారు. ఆదివారం 'నమస్తే తెలంగాణ' బృందం క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లినపుడు తమ గ్రామంలో రైతులు పడుతున్న బాధలను ఏకరువు పెట్టారు. గ్రామంలో రూ.20 వేలు, రూ.30 వేలు అప్పు తీసుకున్న చిన్న చిన్న రైతులకు కూడా మాఫీ కాలేదని చెప్పారు. 99 శాతం మంది రైతులం రెగ్యులర్‌గా రెన్యువల్ చేసుకుంటామని, తమకెందుకు రుణమాఫీ కాలేదని ప్రశ్నించారు. పిన్నింటి శ్రీనివాస్ రెడ్డి (రూ.33 వేలు), యాంసాని కృష్ణమూర్తి (రూ.35 వేలు), పంచకోటి లింగమూర్తి (రూ.37 వేలు) మాట్లాడుతూ తమ పేర్లు మొదటి జాబితాలోనే రావాల్సినవని, మూడో జాబితాలో కూడా రాలేదని, ఇంకెప్పుడు ఇస్తారని వాపోయారు. మాఫీ జాబితాలో రాని వారు బ్యాంకులకు వెళ్లి స్టేట్‌మెంట్ తీసుకుని వచ్చి తమకు ఇవ్వాలని స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి చెబితే పది రోజుల కింద ఇచ్చినా ఇప్పటి వరకు సడీ చప్పుడు లేదని తాను ఇచ్చిన దరఖాస్తు పెంట బొందల ఏసినట్టే ఉన్నారని కాటం తిరుపతిరెడ్డి అనే రైతు మండిపడ్డాడు. మాఫీ కాని వాళ్ల పరిస్థితి ఇలా ఉంటే మాఫీ అయిన వారి పరిస్థితి మరోలా ఉందని కొందరు చెప్పుకొచ్చారు. తమ గ్రామానికి చెందిన రెడ్డి వీరయ్య అనే రైతు రూ.1.30 లక్షలు అప్పు తీసుకుంటే ఈ నెల 9 వరకు వడ్డీతో కలిపి రూ.1,36,500 అయ్యాయని, ఇందులో రూ.1.32 లక్షలు మాత్రమే మాఫీ కింద చూపారని, మిగతా రూ.4,500 చెల్లించే వరకు మెట్‌పల్లిలోని కేడీసీసీ బ్యాంకులో రెన్యువల్ చేయలేదని చింతిరెడ్డి వెంకటరెడ్డి అనే రైతు చెప్పాడు. నిజానికి రూ.2 లక్షల వరకు అప్పు మాఫీ చేసినపుడు వీరయ్యకు చెందిన రూ.1,36,500 ఎందుకు మాఫీ చేయలేదని వెంకటరెడ్డి ప్రశ్నించాడు.

## అయినవారికి అందలం.. కానివారికి శరగోపం!

### దేవాదాయ శాఖలో కానరాని పారదర్శకత

### కొందరిపై ఈవోల ప్రేమ.. కనికరించిన కమిషనర్

### అధికారుల తీరుపై ఆందోళన సిద్ధమవుతున్న ఉద్యోగ సంఘాలు

వేములవాడ, ఆగస్టు 18 : రాష్ట్ర దేవాదాయ శాఖ ఉద్యోగుల బదిలీల్లో అయినవారికి అందలం.. కానివారికి శరగోపం అన్నట్లుగా తయారైంది. దేవాదాయ శాఖ ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులను బదిలీ చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటూ ఏళ్ల తరబడి ఒకే చోట ఉన్నారని కసరత్తు చేసి, కమిటీలు వేసి, ప్రత్యేక జీవోలు తీసి మరీ బదిలీ చేసింది. అయితే, వడ్డించేవాడు మనవాడైతే ఏ మూలన ఉన్నా అన్నీ మనకు చేరుతాయన్న సామెతను అక్షరాల నిజం చేశారు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు. జూలై 30 నాటికి బదిలీ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ అసెంబ్లీ నడుస్తున్న నేపథ్యంలో ప్రత్యేక జీవోలను తీసి మరీ ఈ నెల 5వ తేదీ అర్ధరాత్రి బదిలీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా, యాదగిరిగుట్ట నుంచి వేములవాడ రాజన్న ఆలయానికి బదిలీ అయిన పర్యవేక్షకుడు రాజన్‌బాబును మళ్లీ యాదగిరిగుట్టకే బదిలీ చేయగా, అక్కడికి బదిలీ అయిన పర్యవేక్షకుడు గోలి శ్రీనివాస్‌ను వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌కు పీఏగా విధులు నిర్వహించేందుకు మార్పు ఉత్తర్వులను శనివారం జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్ర దేవాదాయ శాఖ ఉద్యోగుల్లో కలకలం రేపుతోంది.

#### పది రోజులకే మారిన ఉత్తర్వులు

దేవాదాయ శాఖలో ఉద్యోగులు తిష్ట వేసి ఆలయాలను అప్రతిష్టపాలు చేస్తున్నారని, రాష్ట్ర దేవాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ బదిలీ చేస్తామని సమావేశాలు నిర్వహించి మరీ నిర్ణయాలు తీసుకున్న ఉన్నతాధికారులు పది రోజులకే మార్పు ఉత్తర్వులు ఇచ్చారు. బదిలీల్లో పైరవీలకు తావులేదు.. నిక్కచ్చిగా ఉంటాయని సాక్షాత్తూ ఉద్యోగులను కార్యాలయానికి పిలిపించి మరీ చెప్పిన అధికారులే బదిలీ మార్పుల ఉత్తర్వులు ఇవ్వడాన్ని ఉద్యోగులు తీవ్రంగా నిరసిస్తున్నారు. కమిటీలు వేసిన అధికారులు, బదిలీకి కసరత్తు చేసి ఇప్పుడెలా ఉత్తర్వులు మారుస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

#### ఉద్యోగులపై ఈవోలకు ప్రేమ ఎలా?

ఈ నెల 5వ తేదీ అర్ధరాత్రి తర్వాత బదిలీ ఉత్తర్వులు జారీ చేసిన దేవాదాయశాఖ కమిషనర్ 7వ తేదీన రాష్ట్రంలోని అన్ని దేవాలయాల కార్య నిర్వహణాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే ప్రతి ఉద్యోగిని రిలీవ్ చేయాలని, ఉద్యోగులను రిలీవ్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే ఈవోలను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఉద్యోగులు రిలీవ్ తీసుకోకపోయినా.. బదిలీ అయిన స్థానంలో రిపోర్టింగ్ చేయకపోయినా ఈవోలు వారిపై చర్యలు తీసుకోవాలని నిక్కచ్చితమైన ఆదేశాలు జారీ చేయడంతో ఉద్యోగులు విధుల్లో చేరారు. ఇంతవరకు బాగానే ఉన్నా రాష్ట్రంలోని భద్రాచలంలో పనిచేస్తున్న ఏఈఓ భవానీ రామకృష్ణను యాదగిరిగుట్టకు బదిలీ చేశారు. వేములవాడలో పనిచేస్తున్న ఏఈవో సంకెపల్లి హరికిషన్‌ను భద్రాచలం బదిలీ చేశారు. అయితే, భద్రాచలం ఏఈవో రిలీవ్ కాకపోవడంతో వేములవాడ ఏఈవో హరికిషన్‌ను యాదగిరిగుట్టకు బదిలీ చేశారు. భద్రాచలం కార్య నిర్వహణాధికారి అభ్యర్థన మేరకే ఏఈవోను రిలీవ్ చేయలేదన్న విషయం దేవాలయ ఉద్యోగులు చెప్పారు. ఇక ఇదిలా ఉంటే యాదగిరిగుట్టలో పనిచేసిన పర్యవేక్షకుడు రాజన్‌బాబు ఇక్కడే పని చేయాలని.. అతని సేవలు తమకు ఎంతో అవసరం ఉన్నాయని దేవాదాయ శాఖ కమిషనర్‌కు సాక్షాత్తూ అక్కడి ఈవో కోరినట్లు తెలిసింది. ఆయన కోరికను కూడా మన్నించిన కమిషనర్ కేవలం పది రోజులు కాకముందే మార్పు ఉత్తర్వులను జారీ చేస్తూ రాజన్‌బాబు యాదగిరిగుట్టకు పని చేయాలని ఆదేశించారు. మరి సదరు ఉద్యోగులపై ఈవోలకు ఉన్న ప్రేమ ఏంటి?. ఉద్యోగంలో చేరిన ఉద్యోగులతో పని చేయించుకోవాలని ఆదేశించాల్సిన కమిషనర్.. ఈవోలకు సదరు ఉద్యోగులపై ఉన్న ప్రేమను ఎందుకు కనికరించారో అర్థం కావడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో పని చేయించుకోవాల్సిన సంబంధిత అధికారులు ప్రత్యేకంగా ఫలానా ఉద్యోగి కావాలని అడిగి తీసుకోవడం వెనుక ఆంతర్యం ఏంటో ఇంకా లక్ష్మీనరసింహస్వామికో.. రాజరాజేశ్వరస్వామికో తెలియాలి. బదిలీల్లో పక్షపాతం చూపిస్తూ పారదర్శకత లేని వ్యవహారాన్ని ఆలయ ఉద్యోగ సంఘాలు తప్పుపడుతున్నాయి.

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలకు,
ఫోటోగ్రాఫర్స్‌కు మరియు ల్యాబ్ మిత్రులకు,
శ్రేయోభిలాషులకు మరియు ఆదరపడుతున్న అందరికీ
ప్రపంచ ఫోటో గ్రఫీ
రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు
స్వాగత్ డిజిటల్ కలర్ ల్యాబ్
రాజన్న సిరిసిల్ల జిల్లా
ఫోటో & విడియో గ్రాఫర్స్ అధ్యక్షులు-సి